క్లుప్తంగా

హిందూ భజన గురువులను ఆదుకోవాలి



కోట జంక్షన్ వద్ద ర్యాలీలో పాల్గొన్న హిందూ భజన గురువులు

విజయనగరం టౌన్: ఆర్థికంగా వెనుకబడిన హిందూ భజన గురువులను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరారు. ఈ మేరకు సుమారు పది వేల మంది గురువులతో కోట జంక్షన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భజన గురువుల సంఘ ప్రతినిధి కాళ్ల నాగభూషణరావు మాట్లాడుతూ.. కోలాటం, చెక్కభజన, తప్పిటగుళ్ల గురువులకు రూ. 10 వేల గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున హిందూ సోదరులు పాల్గొన్నారు.

13న వేలంపాట

విజయనగరం ఫోర్ట్: వైద్యారోగ్యశాఖలో పని చేయని 11 వాహనాలను ఈనెల 13వ తేదీ ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్టు డీఎంహెచ్‌ఓ ఎస్. భాస్కరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం వివరాలు ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ రాధిక, తదితరులు

పూసపాటిరేగ: జాతీయ నులిపురుగుల నివారణ దినంపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన వాల్‌పోస్టర్లను సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎం. రాధిక మాట్లాడుతూ, ఈనెల 9న అన్ని పాఠశాలలు, కళాశాలల్లో నులిపురుగు నివారణకు ఆల్బెండోజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఒక సంవత్సరం నుంచి 19 సంవత్సరాలోపున్న వారు మాత్రలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమం విజయవంతం చేయడానికి పంచాయతీరాజ్, హెల్త్ సిబ్బంది కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, సీహెచ్‌ఓ వేదమణి, సిబ్బంది ఆర్‌వీ రమణ, బంగారుబాబు, తదితరులు పాల్గొన్నారు.


చురుగ్గా డ్రైన్ల నిర్మాణం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పూతికపేటలో సీసీ డ్రైన్ల నిర్మాణాలు చురుకుగా సాగుతున్నాయి. ఇప్పటికే గ్రామంలోని పలు వీధుల్లో సీసీ రహదారులు, డ్రైన్ల నిర్మాణం పూర్తి కావడంతో వాటిపై పలకలను ఏర్పాటు చేశారు. పనులపై గ్రామస్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు లెంక గోవింద పనులు పర్యవేక్షించారు.

నేడు గుషిణిలో వైద్యశిబిరం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని గుషిణి గ్రామంలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ సచివాలయం వద్ద ఉదయం 9 గంటలకు శిబిరం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. శిబిరంలో నిపుణులైన వైద్యులు పాల్గొంటారని, వివిధ రకాల సమస్యలతో బాధపడుతున్న రోగులు సద్వినియోగపరుచుకోవాలని కోరారు.

రాజకీయ సమాధి తప్పదు..



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈశ్వరయ్య

విజయనగరం పూల్‌బాగ్: బీజేపీతో కూడిన ఏ పార్టీకైనా రాజకీయ సమాధి తప్పదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి. ఈశ్వరయ్య అన్నారు. సోమవారం స్థానిక అమర్‌భవన్‌లో పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశాన్ని అధోగతి పాల్జేసిన బీజేపీతో కలిసి ఎన్నికలకు వెళ్లిన ఏ పార్టీనైనా ఓడించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, జిల్లా సహాయ కార్యదర్శులు బి. అశోక్, ఎ. ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

విజయనగరం రూరల్: విజయనగరం తహసీల్దార్ కార్యాలయం హెచ్‌డీటీగా కొట్నాన శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తహసీల్దార్ కార్యాలయంలో హెచ్‌డీటీగా పని చేసిన ఎస్.కోటేశ్వరుడు గత నెల 31న పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో నెల్లిమర్ల సీఎస్‌డీటీగా విధులు నిర్వహిస్తున్న కొట్నాన శ్రీనివాసరావును విజయనగరం హెచ్‌డీటీగా బదిలీ చేశారు.

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

● మేయర్ విజయలక్ష్మి



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న నగర మేయర్ విజయలక్ష్మి, తదితరులు

విజయనగరం: ప్రజలకు మౌలిక వసతులు కల్పనే ధ్యేయంగా కార్పొరేషన్ పాలకవర్గం కృషి చేస్తోందని నగర మేయర్ వి.విజయలక్ష్మి అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 7, 9, 10, 11, 13, 25 డివిజన్లలో సీసీ రోడ్లు, కాలువలు, కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు సోమవారం ఆమె శంకుస్థాపనలు చేశారు. శంకుస్థాపనల అనంతరం జోనల్ ఇన్‌చార్జ్ బొద్దాన అప్పారావు, కార్పొరేటర్ ఆల్తి సత్యకుమారి మాట్లాడుతూ, మున్సిపాలిటీ నుంచి కార్పొరేషన్ స్థాయికి ఎదిగిన విజయనగరాన్ని అదే స్థాయిలో ప్రజల అవసరాలకు తగ్గట్లుగా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నేతృత్వంలో నగరం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతోందన్నారు. సోమవారం ఒక్క రోజే మొత్తం ఆరు డివిజన్లలో రూ. 59 లక్షలతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడం ఆనందంగా ఉందన్నారు. మారుమూల ప్రాంతాల్లో సైతం రహదారి సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. మరోసారి శాసనసభ్యుడిగా కోలగట్ల వీరభద్రస్వామిని గెలిపించినట్లయితే సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దుతారనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

విజయనగరం: నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నామని డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. నగరంలోని వివిధ డివిజన్లలో రూ.58 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులను సోమవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా 26, 27, 32, 34, 37 డివిజన్లలో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలతో పాటు 38వ డివిజన్‌లో సామాజిక భవనానికి నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ, ప్రజా సమస్యలను తెలుసుకోవడానికి వార్డు పర్యటనలు, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రజలు తెలియజేసిన సమస్యలను



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సహకారంతో పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు దుప్పాడ సునీత, బాలి పైడిరాజు, తొగురోతు సంధ్యారాణి, రామకృష్ణ, భోగాపురపు లక్ష్మి,, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి



మాట్లాడుతున్న ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు

నెల్లిమర్ల: అమరవీరుల త్యాగాలు మరువలేనివని ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. వెంకటేశ్వరరావు, పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. లక్ష్మి అన్నారు. స్థానిక అమరవీరుల స్మారక భవనంలో జూట్‌మిల్లు అమర కార్మికుల 30వ వర్ధంతి సభ ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా అమరులైన కార్మికుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభించే ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ ముందుకు సాగడం ద్వారా అమరవీరుల త్యాగాలకు సార్థకత చేకూరుతుందన్నారు. 1994లో జూట్ కార్మికుల కోసం ప్రాణత్యాగం చేసిన ఐదుగురు కార్మికుల త్యాగాలు గుర్తించుకుని వారి బాటలో నడవాలన్నారు. కార్యక్రమంలో ఇఫ్టూ నాయకులు ఉమామహేశ్వరరావు, కె. మల్లయ్య, ఎం. గోపాలం, కె. నిర్మల, బి. గీత, కాళ్ల అప్పలసూరి, కిషోర్, ఎస్.వెంకటలక్ష్మి, వి. పార్వతి, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ సేవలు ప్రశంసనీయం

● ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి



ఎంపీడీఓ అప్పలనాయుడును సన్మానిస్తున్న ఎంపీపీ అనూషారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, తదితరులు

భోగాపురం: మండలంలో ఎనిమిది నెలల పాటు పని చేసి అతి తక్కువ కాలంలో అందరి మన్ననలు పొందిన ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు సేవలు ప్రశంసనీయమని ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బదిలీపై వెళ్లిన అప్పలనాయుడును ఎంపీపీ, తదితరులు సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ అనూషారెడ్డి మాట్లాడుతూ, అంకితభావంతో విధులు నిర్వహిస్తే తగిన గుర్తింపు వస్తుందన్నారు. ప్రభుత్వం అమలుచేసిన జగనన్న సురక్ష, జగనన్న ఆరోగ్య సురక్ష, ఆడుదాం ఆంధ్రా, వై ఏపీ నీడ్స్ జగన్, కులగణన వంటి కార్యక్రమాలను విజయవంతం కావడంలో ఎంపీడీఓ పాత్ర ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి. చంద్రకళ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ దాసరి బంగారయ్య, ఈఓపీఆర్‌డీ సురేష్, ఎంఈఓలు రమణమూర్తి, చంద్రమౌళి, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



బీటీ రోడ్డును ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: అన్ని రంగాల్లో విజయనగరాన్ని అభివృద్ధి చేయడమే తన అభిమతమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 35వ డివిజన్ వీటీ అగ్రహారం గాంధీనగర్‌లో రూ.36.50 లక్షలతో నిర్మించిన బీటీ రోడ్డుతో పాటు, రూ.18.75 లక్షలతో నిర్మించిన గాంధీ పార్కును డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి స్థానిక కార్పొరేటర్ పద్మావతితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు చందక శ్రీనివాసరావు, బాలి పద్మావతి మాట్లాడుతూ.. తమ ప్రాంతంలో మౌలిక సదుపాయాలు కల్పనతో పాటు ప్రజోపయోగ నిర్మాణాలు కూడా చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. కొన్నేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన తమ ప్రాంతాలు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చొరవతో అభివృద్ధి దిశగా పయనిస్తున్నాయని చెప్పారు. వీటీ అగ్రహారం జంక్షన్ ప్రధాన రహదారిని విస్తరించడంతో వాహన చోదకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. గాంధీనగర్ ప్రాంతంలో నిరుపయోగంగా పడి ఉన్న స్థలాన్ని పార్కుగా అభివృద్ధి చేయడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ మారం బాల బ్రహ్మారెడ్డి, తాత్రాజు కృష్ణ, బాలి ప్రతాప్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

విజయనగరం పూల్‌బాగ్: మిమ్స్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద మిమ్స్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మిమ్స్ యాజమాన్యం స్పందించి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్నారు. అలాగే సస్పెండ్ చేసిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కె. సురేష్, టీవీ రమణ, కిల్లంపల్లి రామారావు, మిరప నారాయణరావు, వి.ఆదినారాయణ, రామకృష్ణ, కామునాయుడు, నర్సింగరావు, రమణ, వరలక్ష్మి, గౌరి, భవాని, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

విజయనగరం అర్బన్:



రక్తదానం చేస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

విజయనగరం చాంబర్ ఆఫ్ కామర్స్ 75 సంవత్సరాల ప్లాటినం జూబ్లీ ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం స్థానిక రోటరీ క్లబ్‌లో నిర్వహించిన రక్తదాన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా 80 యూనిట్ల రక్తం సేకరించారు. చాంబర్ అధ్యక్షుడు కె. ప్రకాశ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పూర్వ అధ్యక్షులు ఎ.చంద్రశేఖరరావు, ఆరిశెట్టి రాధానరసింగరావు, వీవీ కాశీ విశ్వనాథం, కె. సీతారామమూర్తి, జి.శివకుమార్, ఎంవీ చలం, అరుణ్ సోథానీ, తదితరులు పాల్గొన్నారు.

చాంబర్ ఆఫ్ కామర్స్ ఉమెన్ వింగ్ ఎన్నిక ఏకగ్రీవం

● సెక్రటరీగా రవ్వా మంజు





రవ్వా మంజు గుడిస జ్యోతి

విజయనగరం అర్బన్: విజయనగరం చాంబర్ ఆఫ్ కామర్స్ ఉమెన్ వింగ్ నూతన కార్యవర్గం స్థానిక చాంబర్ కార్యాలయంలో సోమవారం బాధ్యతలను స్వీకరించింది. విజయనగరం చాంబర్ ఆఫ్ కామర్స్ అనుబంధ కమిటీగా ఏర్పడిన ఈ కమిటీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వైభవ్ జ్యూయలర్ చైర్‌పర్సన్ మల్లిక మనోజ్, గౌరవ అతిథులుగా ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ఉమెన్ వింగ్ చైర్‌పర్సన్ డాక్టర్ గీతా శ్రీకాంత్, విజయనగరం చాంబర్ ఉమెన్ వింగ్ చైర్‌పర్సన్ జిజా వైస్‌రాజ్ హాజరయ్యారు. అనంతరం ఉమెన్ వింగ్ సెక్రటరీగా రవ్వా మంజు, అధ్యక్షురాలిగా గుడిస జ్యోతి, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీగా నీట విజ్వాని, వైస్ ప్రెసిడెంట్‌గా బండారు విశాలి, జాయింగ్ సెక్రటరీగా బోర ఐశ్వర్య, కోశాధికారిగా గోకవరపు కృష్ణవేణి బాధ్యతలు స్వీకరించి ప్రమాణం చేశారు. సలహాదారులుగా దుర్గా ఉమాబాలాజీ, డాక్టర్ కృష్ణశాంతి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా మాడ విద్య, డాక్టర్ పూసర్ల సునీత, ఆరిశెట్టి దేవి, కట్టమూరి ప్రత్యూష, మోటమర్రి గాయత్రి, కోళ్ల సాధన, ఆస్మభాను, రీమా కోఠారి, ఆరిశెట్టి శ్యామల, రజిత, శశిభార్గవి ఎన్నికయ్యారు. అదే విధంగా ఉమెన్ వింగ్ అడ్వైజరీ చైర్మన్‌గా చాంబర్ ఆఫ్ కామర్స్ పూర్వ అధ్యక్షుడు వీవీఎస్ ప్రసాద్, సభ్యులుగా ఆరిశెట్టి శ్రీనివాస్, గోదావర్తి జగదీష్, టీవీపీ గుప్తా, ప్రవీణ్‌కుమార్ బాధ్యతలు తీసుకున్నారు. కార్యక్రమంలో విజయనగరం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాల సందర్శన

వేపాడ: మండలంలోని కొండగంగుబూడి గిరిజన ఆశ్రమ పాఠశాలలను ఎంఈఓ బాల భాస్కరరావు సోమవారం సందర్శించారు. పాఠశాలను పదోతరతి పరీక్షల కేంద్రంగా ఎంపిక చేయడంతో అక్కడి తరగతిగదులు, ఫర్నీచర్, తాగునీరు, మరుగుదొడ్లు తదితర సదుపాయాలను పరిశీలించారు. ఎనిమిదో తరగతి విద్యార్థుల కు ప్రభుత్వం అందజేసిన బైజూస్ కంటెంట్ ట్యాబ్‌లను విద్యార్థులు వినియోగిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. అనంతరం పి.కె.ఆర్.పురం, రామస్వామిపేట, బొద్దాం ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. విద్యార్థుల నోట్, వర్క్ బుక్స్, లెసెన్‌ప్లాన్ పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

దివ్యాంగుడికి బ్యాటరీ ట్రై సైకిల్ అందజేత

చీపురుపల్లి: ఎంపీ ల్యాడ్స్ నిధులతో సమకూర్చిన బ్యాటరీ ట్రైసైకిల్‌ను గరివిడి మండలం, ఏనుగువలసకు చెందిన ఓ దివ్యాంగు డికి వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ సోమవారం అందజేశారు. చీపురుపల్లిలోని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వంశీకృష్ణ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని చెప్పారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తన ఎంపీ ల్యాడ్స్ నిధులతో దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేస్తున్నారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కొసిరెడ్డి రమణ, ముల్లు పైడిరాజు, డబ్బాడ జగదీష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

గంట్యాడ: మండలంలోని నరవ గ్రామ ఏఎంజీ కాలనీ సమీపంలో ఆదివారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.గంట్యాడ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ మజ్జి గణపతిరావు తెలిపిన వివరాలు...బొండపల్లి మండలం జె.గుమడాం గ్రామానికి చెందిన బొత్స అప్పలరాజు విశాఖపట్నంలో టిఫిన్ దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన కుమార్తె రజస్వల ఫంక్షన్‌కు స్వగ్రామానికి వారం రోజులు క్రితం వచ్చాడు. ఈనెల 4వ తేదీన రాత్రి గుమడాం నుంచి పల్సర్ బైక్ పై బయలు దేరి విజయనగరం వెళుతుండగా నరవ ఏఎంజీ కాలనీ సమీపంలో విజయనగరం నుంచి వస్తున్న కారు ఢీకొట్టడంతో తల కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో 108 సిబ్బంది విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి మెరు గైన చికిత్స కోసం విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు వైద్యులు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విజేతలకు బహుమతులు



కలెక్టర్ నాగలక్ష్మి నుంచి బహుమతి అందుకుంటున్న విజేత

విజయనగరం అర్బన్: జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా గత నెల 24న విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, డ్రాయింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి కలెక్టర్ నాగలక్ష్మి బహుమతులు ప్రదానం చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో విజేతలకు నగదు బహుమతి అందజేశారు. వ్యాసరచన పోటీల్లో వై. యశ్వంత్ (కెల్ల జెడ్పీహెచ్ఎస్, గుర్ల), వై.ప్రణతి (కుమిలి జెడ్పీహెచ్ఎస్, పూసపాటిరేగ), బి.మానస (ఎంజేపీబీసీడబ్ల్యూఆర్ఎస్, నెల్లిమర్ల) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. వక్తృత్వ పోటీలో పి.సౌభాగ్య (నెల్లిమర్ల జెడ్పీహెచ్ఎస్), పి.శేషాచార్యులు (ఏపీఎంఎస్, మదనాపురం, గంట్యాడ), ఎం.కీర్తి (కేజీబీవీ, తెర్లాం) విజేతలుగా నిలిచారు. డ్రాయింగ్ పోటీలో బి.దుర్గాలక్ష్మి (ఎంజేపీబీసీడబ్ల్యూ ఆర్ఎస్, నెల్లిమర్ల), జి.నాని (జెడ్పీహెచ్ఎస్, పీఎస్ఆర్‌పురం, గంట్యాడ), ఎ.హారిక (బీపీఎంహైస్కూల్, విజయనగరం) బహుమతులు గెలుచుకున్నారు. కార్యక్రమంలో జేసీ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, డీఆర్ఓ ఎస్‌డీ అనిత, డీఈఓ బి.లింగేశ్వరరావు, డీఎంఅండ్‌హెచ్‌ఓ ఎస్.భాస్కరరావు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం



చీపురుపల్లి: బోరు డ్రిల్లింగ్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తదితరులు

● ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ చెప్పారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ సచివాలయం-1 పరిధిలో తాగునీటి కోసం హ్యాండ్ బోరు ఏర్పాటుకు మండల పరిషత్ నిధులు రూ.1.20 లక్షలు మంజూరయ్యారు. బోరు డ్రిల్లింగ్ పనులను ఎంపీ బెల్లాన సోమవారం పూజలు చేసి ప్రారంభించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి సమస్య పరిష్కారానికి, రోడ్లు, వీధి కాలువల నిర్మాణానికి త్వరితగతిన నిధులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. మౌలిక వసతుల విషయంలో ప్రజలకు ఎక్కడ ఎలాంటి అవసరం ఉన్నా తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, పార్టీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, పార్టీ పట్టణ అధ్యక్షుడు పతివాడ రాజారావు, నాయకులు కొసిరెడ్డి రమణ, కర్రోతు రమణ, దాలయ్య, మహేష్, రాము పాల్గొన్నారు.

ఇంటింట కుళాయిల పనులకు భూమిపూజ

లక్కవరపుకోట: జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా మండలంలోని గనివాడ, గంగుబూడి, నిడుగట్టు గ్రామాల్లో ఇంటింట కుళాయిల ఏర్పాటు పనులకు ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు సోమవారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో సుమారు రూ.15.56 కోట్లతో ఇంటింట కుళాయిలు ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లో సిమెంట్ రోడ్లు నిర్మించామని, పలుగ్రామాల బీటీ రోడ్లను పునరుద్ధరించామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం పల్లెలను పూర్తిగా విస్మరించిందని గుర్తు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ చంద్రకళ మాట్లాడుతూ గంగుబూడి, నిడుగట్టు, గనివాడ గ్రామాల్లో రూ.31 లక్షలతో ఇంటింట కుళాయిల ఏర్పాటు పనులను ఏప్రిల్ నెలాఖరులోగా పూర్తిచేస్తామని తెలిపారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు గొలగాని హరిప్రసాద్, రవ్వ శివశంకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు కోసూరి పెదరమణ, నమ్మి చిన్నబాబు, గేదెల సూరినాయుడు, రంది ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రూ.3 లక్షలతో శ్మశాన వాటికకు సీసీరోడ్డు

గజపతినగరం: మండలంలోని ఎం.వెంకటాపురం గ్రామ బీసీ కాలనీ శ్మశానవాటికకు సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.3 లక్షల ఉపాధి హామీ నిధులను మంజూరు చేసిందని మండల వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బెల్లాన త్రినాథరావు తెలిపారు. రోడ్డు పనులకు స్థానిక వైస్ సర్పంచ్ కర్రి రామునాయుడుతో కలిసి సోమవారం ఆయన భూమిపూజ చేశారు. ఈసందర్భంగా త్రినాథరావు మాట్లాడుతూశ్మశాన వాటికకు సీసీరోడ్డు లేక పోవడంతో వర్షాకాలంలో ఇబ్బందులుపడుతున్నామని ఎం.వెంకటాపురం బీసీ కాలనీ వాసు లు ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక దృష్టికి తీసుకురావడంతో, సమస్యను ఆమె ఎమ్మెల్యే బొత్స అప్పలనరస య్యకు వివరించారని చెప్పారు. ఎమ్మెల్యే స్పందించి నిధులు మంజూరు చేయించారని పేర్కొన్నారు. స్థానిక నాయకులు కర్రి నానాజీ, గురుగుబిల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



